క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారుల ఎత్తు పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రీప్రైమరీ చదువుతున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు సీడీపీవో పురాణం నాగరాణి అన్నారు. పోషన్ మహా మాసోత్సవాల్లో భాగంగా ఇన్నేసుపేట, కంద్రవీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారుల ఎత్తును కొలిచి, బరువులను తూచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0–5 ఏళ్లలోపు చిన్నారుల ఆరోగ్య స్థితిని చూసి తీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నీలవేణి, బి.సుజాతలు పాల్గొన్నారు.

క్విజ్‌పోటీల విజేత కొత్తపల్లి

మందస: కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. నల్లబొడ్లూరులో జరిగిన జిల్లాస్థాయి క్విజ్‌పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. విజేతలను స్థానిక సర్పంచ్ సేనాపతి దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం అభినందించి, ప్రత్యేక బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం గవ్వ భీమారావు, పీఎంసీ చైర్మన్ టి.జ్యోతి, ఉపాధ్యాయులు ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, మజ్జి చిత్రసేను పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

టెక్కలి: ఉత్తరప్రదేశ్‌లోని హర్పూర్ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులపై అక్కడ పోలీసులు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ టెక్కలిలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల పరిరక్షణ బిల్లుకు తక్షణమే కేంద్రం ఆమోదించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, న్యాయవాదులు డి.రాజేశ్వరరావు, కె.వెంకట్రావు, పి.బాబూరావు, బి.కృష్ణమూర్తి, పి.సాయిరాజు, ఎం.గోవింద్, పి.ఆనంద్, పి.చంద్రుడు, కె.ఈశ్వరరావు, ఎస్.రాజన్నాయుడు, ఎస్.ధర్మరాజు, ఎల్.బాలకృష్ణ పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి



బీమా నమోదు ప్రక్రియలో నాయకులు

టెక్కలి: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్న గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల కోసం అందజేస్తున్న బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఎస్.మోహన్ కోరారు. టెక్కలి మండలం బూరగాం గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీమా సదుపాయాన్ని వినియోగించుకోండి

నందిగాం: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైఎస్సార్‌సీపీ అందజేస్తున్న బీమా సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. జగనన్న సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి జడ్యాడ జయరాం ఆధ్వర్యం నందిగాం 1, 2 సచివాలయ కన్వీనర్లు, గృహసారథలతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పలువురికి బీమా పత్రాలను అందజేశారు.

మత్స్యకార డైరెక్టర్‌కు పరామర్శ

సోంపేట: మత్స్యకార డైరెక్టర్ మద్దు రాజారావును జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాయిరాజ్ శుక్రవారం పరామర్శించారు. రాజారావు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది స్వగ్రామానికి చేరుకోవడంతో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీలు నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి తదితరులున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు ఫిర్యాదు

కవిటి: కవిటిలోని మహిళా సంఘం భవనం సమీపంలోని తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదిక భవనం వద్ద ఇటీవల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని..వాటిని అరికట్టాలని వేదిక ప్రతినిధి ఆర్జాల ముకుందరావు కోరారు. ఈ మేరకు కవిటి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. జనసంచారం తక్కువగా ఉన్న సంఘం భవనం వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి తమ భవనానికి రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరారు.

ఘనంగా భూలోకమ్మ ఆలయ ప్రతిష్ఠ

కాశీబుగ్గ: అమలకుడియా పంచాయతీ వీరభద్రాపురం గ్రామంలో భూలోకమ్మ ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రతిష్ఠాపకులు కొర్ల జనార్దనరావు, లోలాక్షి, మురళీకృష్ణ చౌదిరి, శిరీషా ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

క్రీడా సంబరం



మందస: కబడ్డీలో హోరాహోరీ పోరు



వజ్రపుకొత్తూరు రూరల్: క్రీడలను ప్రారంభిస్తున్న మధుకేశ్వరరావు



కంచిలి: లాంగ్ జంప్ పోటీలో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులు



కవిటి: ఎంపికైన వాలీబాల్‌జట్లు



పలాస: తలపడుతున్న క్రీడాకారులు

మందస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలు, క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన క్రీడాకారుల ఎంపిక పోటీల్లో సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు జగన్నాథపురం పురుషోత్తం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ఉమారాజ్, మార్పు ట్రస్ట్ చైర్మన్ మట్ట ఖగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు

కంచిలి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మకరంపురియాపల్లి ఏపీ మోడల్ పాఠశాల ఆవరణలో మండలస్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా క్రీడా' ఎంపికలను శుక్రవారం చేపట్టారు. ఇందులో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికల క్రీడాకారులకు వాలీబాల్, టెన్నీకాయిట్, షటిల్, అథ్లెటిక్స్, గేమ్స్‌లో క్రీడాకారుల ఎంపికలను చేపట్టారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు ఈ నెల 11వ తేదీన ఇచ్ఛాపురంలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించబోయే పోటీల్లో పాల్గొంటారు. జడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు, సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, ఎంఈవో–2 కె.చిట్టిబాబు, స్థానిక ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు మోహనరావు, ఎల్.కె.పండా పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాకారుల ఎంపికలు

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల ఎంపికలు శుక్రవారంతో ముగిశాయి. అండర్–14, అండర్–17 విభాగాలకు సంబంధించి చేపట్టిన ఎంపికల్లో బాలురు, బాలికల జట్లు ఆయా విభాగాలకు సంబంధించి ఎంపిక చేసినట్టు మండల స్పోర్ట్స్ ఆఫీసర్ పాడియా కృష్ణ తెలిపారు.

క్రీడలకు ప్రభుత్వం తోడ్పాటు

వజ్రపుకొత్తూరు రూరల్: క్రీడలకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు అన్నారు. నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అండర్–14, అండర్–17 బాలబాలికల ఖోఖో పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలన్నారు. పీడీలు చంద్రశేఖర్, పైలగజేంద్ర పర్యవేక్షణలో జరిగిన క్రీడల్లో ప్రతిభ కనబర్చిన 12 మంది బాలురు, 12 బాలికలను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయులు అప్పలస్వామి ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

పలాస: బొడ్డపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు ముగిశాయి. పది పాఠశాలల నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను సర్పంచ్ మదన్ ప్రారంభించగా.. ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు హెచ్‌ఎం ఎ.వీర్రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ

- జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేట మేజర్ పంచాయతీలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులకు బ్రోచర్లను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ విజయ, సమన్వయకర్త సాయిరాజ్

సోంపేట: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేరువ చేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీలోని మూడు సచివాలయాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం పూర్తయిన సందర్భంగా స్థానిక గాంధీ మండపం వద్ద శుక్రవారం కేక్ కట్ చేసి ముగింపు వేడుకలు నిర్వహించారు. తొలుత ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమాన్ని వివరించి.. చేకూరిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. అనంతరం విజయ, సాయిరాజ్‌లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. నిత్యం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, ఒక్కో సచివాలయం పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ. 20 లక్షలల చొప్పున నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేదల పక్షపాతిగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌కు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు నిమ్మన దాస్, పైలదేవదాస్ రెడ్డి, సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, యర్ర రజని, శిలగాన భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, ధర్మారావు, ఉపసర్పంచ్ వెంకటరమణ, పార్టీ నాయకులు నెహ్రూ, వెంకన్న, ఢిల్లీ, గంగాధర్ పట్నాయక్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి
- లంకపాడు, డమర గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లంకపాడులో సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా అభివృద్ధి వెలుగు ప్రకాశిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. నరసింగపల్లి పంచాయతీ పరిధి లంకపాడు, డమర తదితర గిరిజన గ్రామాల్లో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల్లో ఎటువంటి సంక్షేమానికి నోచుకోకుండా గిరిజన పల్లెలు దీనవస్థలో ఉండేవని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు గ్రామస్థాయిలో సచివాలయ పాలనతో ప్రతి గిరిజన గ్రామంలో అర్హత కలిగిన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ముఖలింగాపురం సర్పంచ్ బందపల్లి రాకేష్, నాయకులు పి.వీరవసంత్, కె.చిన్నారావు, కె.జగన్, సర్పంచ్‌లు, నాయకులు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, ఎల్.రాంబాబు, ఎ.రాహుల్, పి.శ్రీనివాస్, బి.శ్రీను ఉన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ



వీవీఆర్‌పురంలో ఎల్లమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు

మందస: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం పరామర్శించారు. మఖరజోల గ్రామానికి చెందిన కొండల నారాయణమ్మ, నారాయణపురంలో మడియా రత్నాలు, గెడ్డవూరులో పిచ్చుక అప్పలమ్మ, వెంకటవరదరాజపురంలో ఇప్పిలి ఎల్లమ్మ, కొత్తపల్లిలో శశిరేఖపాణిగ్రాహి, పోలేటి మౌనిక మరణించగా.. వారి కుటుంబాలను మంత్రి పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయనతో పాటు ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్‌లు సేనాపతి దివ్య, బత్తిని తేజేశ్వరరావు, తిమ్మల కృష్ణారావు, కోఆప్షన్‌సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు గౌరకల పార్వతి, తెప్పల ఉమాపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దున్న హరికృష్ణ, మార్పు కృష్ణమూర్తి, బాలక విజయశ్రీ, మార్పు వెంకటరమణ ఉన్నారు.

మంత్రికి సత్కారం



మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న పాస్టర్లు

కాశీబుగ్గ: పాస్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంత్రి సీదిరి అప్పలరాజును శుక్రవారం సత్కరించారు. స్థానికంగా ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో పలాస, టెక్కలి నియోజకవర్గాలకు చెందిన వివిధ చర్చిల పాస్టర్లు సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పాస్టర్లకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి పరిష్కరించిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, పాస్టర్లు రాజు, వైఎస్ ఏలియా, కె.అబ్రహం, ఎ.కృపారత్నం ఉన్నారు.

139 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు

కోటబొమ్మాళి: మండల వ్యాప్తంగా 139 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యావని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ తెలిపారు. అక్కయ్యవలస, శ్రీజగన్నాధపురం, విశ్వనాధపురం, కస్తూరిపాడు, దుప్పలపాడు పంచాయతీల్లోని లబ్ధిదారులకు వీటిని మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి చేతులమీదుగా పట్టాలను లబ్ధదారులకు అందజేస్తామన్నారు.

నేడు గోవిందపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వజ్రపుకొత్తూరు: గోవిదపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొంటారన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం

ఇచ్ఛాపురం: బెల్లుపడ పంచాయతీ త్రినాథపేటలో గురువారం సంభవించిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితురాలు జి.లక్ష్మికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సంయుక్తంగా ఐదు వేల రూపాయలను సాయం చేశారు. ఈ మొత్తంతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రచారవిభాగ జిల్లా అధ్యక్షుడ తాడి ఆదిరెడ్డి, కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, జగన్నాయకులు, టింక లక్ష్మి, పార్టీ నాయకులు పిలక సంతోష్, బుడ్డెపు త్రినాథ్ ఉన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత

ఇచ్ఛాపురం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చూడాలని నూతనంగా ఎంపికైన వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కారంగి మోహనరావు సూచించారు. మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ఏర్పడిన ఖాళీల భర్తీలో భాగంగా ఎంపికైన తొమ్మిది మంది వలంటీర్లకు ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేశారు. సర్పంచ్‌లు నీలాపు సారధిరెడ్డి, కారంగి త్రినాథరెడ్డి, సాడి గురుమూర్తి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి ఉన్నారు.

సబ్సిడీపై అపరాల విత్తనాలు అందజేయాలి



మాట్లాడుతున్న నూకయ్యరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులకు అపరాల విత్తనాలను సబ్సిడీపై అందజేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దక్కత నూకయ్యరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెసర, మినుము, చోడి విత్తనాలతోపాటు పరదాలు, ఆయిల్ ఇంజిన్లు, బ్యాటరీ స్ప్రేయర్లు వంటి పరికరాలను సైతం రాయితీపై అందించేలా చూడాలని అధికారులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి పూజారి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీపై అపరాలను అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలానికి సంబంధించి 4,800 ఎకరాల్లో వరిసాగు అయిందని, ఈ–క్రాప్ కూడా పూర్తయినట్టు వివరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు పాల్గొన్నారు.

జానపద కళలను బతికించాలి



కూర్మారావుకు హార్డ్ డిస్కను అందజేస్తున్న కోదండ రామయ్య

పలాస: ప్రజా బాహుళ్యంలో అంతర్భాగంగా ఉన్నటువంటి జానపద కళలను పది కాలాలు పాటు సజీవంగా బతికించుకోవాలని ప్రముఖ 'తెలుగు వెలుగు'అంతర్జాల సదస్సు నిర్వాహకులు (విశాఖపట్నం) పారుపల్లి కోదండరామయ్య హితవు పలికారు. రంగోయి గ్రామానికి చెందిన జానపద పరిశోధకుడు, రచయత బద్రి కూర్మారావును శుక్రవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా కూర్మారావుకు రూ.10 వేలు విలువైన అడ్వాన్స్‌డ్ పోర్టుబుల్ స్టోరేజి డిస్క్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కోదండరామయ్య మాట్లాడుతూ.. తెలుగు భాషా పరిరక్షణ కోసం గిడుగు రామ్మూర్తి తెలుగు కళాపీఠాన్ని పెట్టి జానపద కళలను పరిశోధించి భద్రపరచడం చాలా గొప్పతనం అంటూ కూర్మారావును ప్రశంసించారు. అలాగే బెంగళూరుకు చెందిన ప్రసిద్ధ జానపద రచయత ఆచార్య జి.ఎస్.మోహన్ కూడా తన తెలుగు కన్నడ జానపద రచనలను, రాయలసీమకు చెందిన ఆచార్య చిగిచర్ల క్రిష్ణారెడ్డి తన జానపద రచనలను అందజేసి అభినందించారు. జానపద కళలను పరిరక్షించాలని అందుకు 'బద్రి'పరిశోధనలు ఉపయోగపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయిని బదిలీ నిలిపి వేయాలని వినతి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి తదితరులు

నందిగాం: రౌతుపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని కొర్నాన క్రిష్ణవేణి బదిలీని నిలిపి వేయాలని ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు ఎంఈవో డి.నర్సింహులును శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రౌతుపురం గ్రామానికి 2005–06వ సంవత్సరంలో ఉన్నత పాఠశాల మంజూరు చేసి ఐదుగురు ఉపాధ్యాయులతో విద్యాబోధన చేసేవారన్నారు. అయితే ఇటీవల దగ్గరలో ఉన్న పాఠశాలలో 3, 4, 5 తరగతులను కలిపి వేసినట్టు వివరించారు. దీంతో అందుకు తగినట్లు ఉపాధ్యాయులను నియామకం చేశారు. అయితే ఇటీవల గణిత ఉపాధ్యాయిని క్రిష్ణవేణిని కింతలి పాఠశాలకు బదిలీ చేశారని, అలాగే ఆంగ్ల ఉపాధ్యాయుడును డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలకు పంపించేశారన్నారు. దీంతో రౌతుపురం పాఠశాలలో గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బదిలీ, డిప్యుటేషన్ రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కురమాన బాలక్రిష్ణారావు, నాయకులు శంభాన దాలయ్య, విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, గ్రామస్తులున్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి



జిల్లాకలెక్టర్‌ని వినతి పత్రం అందజేస్తున్న ఎంఎల్‌సి నర్తు రామారావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను శుక్రవారం శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కంచిలి మండలం జలంత్రకోట వద్ద గల గంగాసాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి మంజూరైన పనుల్ని త్వరితగతిన పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని, ఇచ్ఛాపురం వద్ద బెల్లుపడ నుంచి ఈదుపురం వరకు వరద గట్టు నిర్మించాలని, బాహుదా నది వద్ద గ్రోయిన్ నిర్మించాలని, తులసిగాం, ఇన్నీసుపేట కల్వర్ట్‌ని నిర్మించాలని, కవిటి మండలం పెద్ద కర్రివానిపాలెం గ్రామంలో కల్వర్ట్ నిర్మించేలా నీటి పారుదల శాఖకు సూచించాలని కోరారు. అలాగే కవిటి మండలం లండారిపుట్టుగ సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి క్రిష్ణారావు, తడక జోగారావు ఉన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



కవిటి: లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ ఆసరా పింఛన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. టి.బరంపురం పంచాయతీలో పలువురికి మంజూరైన నూతన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే బూర్జపాడు పంచాయతీలో సర్పంచ్ బుడ్డ మోహనాంగి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్ కారంగి త్రినాథ్ రెడ్డి, బుడ్డ కల్యాణ్, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తపుట్టుగలో..

కవిటి: ప్రభుత్వం తాజాగా మంజూరు చేసిన కొత్త పింఛన్లను ఎమ్మెల్సీ నర్తు రామారావు కొత్తపుట్టుగ గ్రామంలో లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ నర్తు చామంతి, లండారిపుట్టుగ పంచాయతీకి చెందిన గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడు గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన కొత్త పింఛన్లను సచివాలయ కోఆర్డినేటర్ వడ్డి కరుణాకర్ పంపిణీ చేశారు. పార్టీ నాయకులు కొయిరి ఢిల్లీరావు, పుక్కళ్ల రామచంద్రుడు, కామరాజు ఉన్నారు.

చంద్రబాబు జీవితమే అవినీతి మయం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి



మాట్లాడుతున్న దువ్వాడ వాణి

టెక్కలి: మామను వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో టీడీపీని కాజేసిన చంద్రబాబు రాజకీయ జీవితం మొత్తం అవినీతి మయమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో జరిగిన రూ. 118 కోట్ల అవినీతి కేవలం శాంపిల్ మాత్రమేనన్నారు. టెక్కలిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజధాని నిర్మాణం పేరుతో వేల ఎకరాలు కాజేయడమే కాకుండా షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్‌అండ్‌టీ కంపెనీల నుంచి భారీగా ముడుపులను చంద్రబాబు అందుకున్నారని ఆరోపించారు. ఆయన హయాంలో చేసిన పనులన్నిటిపై దర్యాప్తు చేపడితే భారీ కుంభకోణం బయటపడడమే కాకుండా చాలామంది టీడీపీ నాయకులు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. చంద్రబాబు రూ. 118 కోట్లు అవినీతికి పాల్పడినట్టు ఐటీ అధికారులు నోటీసులు జారీ చేయగా.. దీనిపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదని ఆమె నిలదీశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్న తరుణంలో ఎలాగైనా రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలనే కుట్రతో నారా లోకేష్ పాదయాత్ర పేరుతో ఎక్కడికక్కడే గొడవలు సృష్టిస్తున్నారని.. దీనికి ఇటీవల జరిగిన సంఘటనలే తార్కాణమన్నారు. అమరావతి కుంభకోణంలో అడ్డంగా దొరికిన చంద్రబాబును నిలదీసే దమ్ము జనసేన కార్యకర్తలు ఉందా అని ప్రశ్నించారు. సమావేశంలో సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, పార్టీ నాయకుడు ఎ.రాహుల్ కుమార్ ఉన్నారు.

మేకల మృతిపై అటవీ శాఖాధికారుల దర్యాప్తు



పద్మాపురంలో దర్యాప్తు చేస్తున్న అటవీశాఖాధికారులు

మందస: మండలంలోని బుడారిసింగి పంచాయతీ పద్మాపురం గ్రామంలో ఇటీవల జరిగిన మేకల మృతిపై శుక్రవారం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము, ఎఫ్‌బీఓలు తూలుగు వెంకటేష్, ఎం.పోలయ్య, ఎ.బాబురావు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేశారు. బాధితుడు పురుషోత్తందొళాయిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ పద్మాపురం గ్రామం రిజర్వ్ ఫారెస్టుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. సంఘటన మధ్యాహ్నం జరగడంతో గుర్తు తెలియని జంతువులు, అడవి జంతువులు సంఘటనకు కారణం కాదని స్పష్టం చేశారు. మృతికి ఇవే కారణమైతే మేకలను కొంతభాగం తినేసి ఉండాలన్నారు. ఊరకుక్కలు మేక పిల్లలను చంపేసి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందివ్వాలని ప్రజలను కోరారు. నిబంధనల మేరకు పంచనామా, నివేదికలు, నిర్ధారణ జరిగితే అటవీశాఖ నుంచి నష్టపరిహారం అందుతుందన్నారు. ఉద్దానం ప్రాంతంలో జరుగుతున్న సంఘటనలకు అడవిపిల్లి కారణమని అనుమానిస్తున్నామన్నారు. పట్టుకోవడానికి అధికారులు, సిబ్బందితో కలసి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే విశాఖ జూ నుంచి ప్రత్యేక సీసీ కెమెరాలను తీసుకువచ్చి ఉద్దానంలో అమర్చామని, అయినా గుర్తు తెలియని జంతువు ఆచూకీ చిక్కలేదన్నారు. చిరుత పులులు, అడవి పులులంటూ ప్రచారాలను నమ్మవద్దని కోరారు. మందస రిజర్వ్ ఫారెస్ట్‌లో అలాంటి జంతువులు లేవని తెలిపారు.

సంక్షిప్తంగా..

వినాయక ఉత్సవాలకు పందిరిరాట

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా కాశీబుగ్గలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా వినాయక మండపానికి శుక్రవారం పందిరిరాట వేశారు. 15, 18వ వార్డు కౌన్సిలర్లు సనపల సింహాచలం, బళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పలాస రైల్వేస్టేషన్ ఆవరణలోని చెరువుగట్టుపై ఉన్న వెంకటేశ్వరకాలనీలో కూడా మండపం ఏర్పాటుకు యువకులు పందిరి రాటను వేశారు.

ప్రజా సాంస్కృతిక కళాయోధుడు 'గరికపాటి'

పలాస: ప్రజా సాంస్కృతిక కళాయోధుడు గరికపాటి రాజారావు అని పలువురు వక్తలు అభివర్ణించారు. ప్రజా కళలకే అతని జీవితాన్ని అంకితమిచ్చాడని చెప్పారు. పలాసలోని సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం గరికపాటి రాజారావు వర్ధంతి కార్యక్రమాన్ని అరుణోదయ కళా సాహితీ సాంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అరుణోదయ జిల్లా శాఖ అధ్యక్షుడు సార్ర రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గరికపాటి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రోటరీ సేవలు అభినందనీయం

సోంపేట: రోటరీ సేవలు అభినందనీయమని కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి అన్నారు. సోంపేట రోటరీ ఆధ్వర్యంలో సోంపేట పోలీస్‌స్టేషన్‌కు రూ. 30 వేల విలువైన జిరాక్స్, ప్రింటర్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సీఐ వరప్రసాద్, ఎస్సై హైమావతి, రోటరీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, సెక్రటరీ పి.వి.కృష్ణారావు ఉన్నారు.